



మన

# జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 88 పేజీలు : 8 వెల : రూ.2/- శనివారం 25 ఏప్రిల్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

**వ్యతిరేకించిన పార్టీల తీరును ఎండగతాం**

**ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్**



**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని ఎన్డీయే కూటమిలోని పార్టీల నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో ఎన్డీయే నేతలు, ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర భాగస్వామ్య పక్షాల వైఖరిని ప్రజలకు వివరించాలని సీఎం చంద్రబాబును పీవీఎన్ మాధవ్ కోరారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రాబోయే 10 రోజుల్లో

మిగతాది 2లో...

## ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

**హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్**

**ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి**




## నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

**కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి**

**తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం**



**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. మిగతాది 2లో...

## ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

**10 థీమ్ లపై శాఖల వారీగా కార్యక్రమాలు -డ్రగ్స్ అడ్డుకట్టకు పిల్లలు, యువతలో చైతన్యం**

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా 10 థీమ్ లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, థీమ్ ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న మిగతాది 2లో...




## బీజేపీలోకి రాఘవ్ చద్దా

**ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..**

**మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ ఎంపీలతో కలిసి బీజేపీలో విలీనం!**

**పార్టీ తన ఆశయాలకు దూరమైందంటూ చద్దా విమర్శలు**

**రాజ్యసభ ఉపనేత పదవి నుంచి తొలగింపే కారణమని ప్రచారం**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి భారీ రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు, కీలక నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా బీజేపీలో చేరనున్నట్లు సంచలన ప్రకటన చేశారు.

మిగతాది 2లో...

## ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

**రేవంత్ నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. పు÷-టటెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్ఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణమని అన్నారు. మిగతాది 2లో...



## ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

**పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం**

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**

**సిఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నంల సంతాపం**

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 24 :**



ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. మిగతాది 2లో...

## చర్చలతోనే పరిష్కారం..

**ప్రాణాలు తీసుకోవద్దు: ఆర్టీసీ నేతలతో భట్టి విక్రమార్క**

**మంత్రుల బృందంతో జేఏసీ నేతల భేటీ**

**డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మల్లు భట్టి**

**ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ**

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 24 :**ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సచివాలయంలో మంత్రుల బృందంతో కలిసి జేఏసీ నేతలతో భేటీ అయిన ఆయన, సమస్యలు ఎంత క్లిష్టమైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. ఇది మనందరి 'ప్రజా ప్రభుత్వం' అని, ఎవరినీ శత్రువులుగా చూసే స్వభావం తమకు లేదని స్పష్టం చేశారు.

మిగతాది 2లో...



## హుగ్లీ నదిలో ప్రధాని విహారం

**బెంగాలీల్లో గంగానదికి ప్రత్యేకత ఉంది**

**ఎక్స్ వేదికగా ఫోటోలు పంచుకున్న మోడీ**



**కోల్‌కతా,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** ప్రధాని నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో బోట్ రైడ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కెమెరాను చేతపట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. హుగ్లీ నది బెంగాల్ సంస్కృతితో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకెళ్తాయన్నారు. ఉదయం హుగ్లీ నది తీరంలో కొంత సమయం

మిగతాది 2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -04-2026

# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీలోకి రాఘవ్ చద్దా

(మొదటి పేజీ తరువాయి)

తనతో పాటు మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ సభ్యులు కూడా బీజేపీలో విలీనం కానున్నారని చెప్పడం సంచలనం సృష్టించింది.ఈరోజు ఢిల్లీలో సీనియర్ ఎంపీలు అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాఘవ్ చద్దా ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "15 ఏళ్లుగా ఆప్‌కు అంకితభావంతో పనిచేశాను. కానీ ఒకప్పుడు అవినీతి నిర్మూలన నినాదంతో అధికారంలోకి వచ్చిన పార్టీ ఇప్పుడు నిజాయతీ రాజకీయాలకు దూరమైంది. నేను సరైన వ్యక్తినే, కానీ తప్పుడు పార్టీలో ఉన్నాను. అందుకే పార్టీకి దూరమై ప్రజలకు దగ్గరవుతున్నాను" అని వ్యాఖ్యానించారు.ఆప్‌కు రాజ్యసభలో మొత్తం 10 మంది సభ్యులు ఉండగా, వారిలో మూడింట రెండొంతుల మంది తనతో పాటు బీజేపీ వైపు వస్తున్నారని చద్దా పేర్కొన్నారు. వీరిలో ప్రముఖ క్రీడాకారుడు హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్ వంటి వారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా పార్టీలో రాఘవ్ చద్దా అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆయన్ను రాజ్యసభలో ఆప్ ఉప నాయకుడి పదవి నుంచి తొలగించి, ఆ స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించారు. ఈ పరిణామం పార్టీ అంతర్గత విభేదాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలోనే చద్దా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికే పలు సవాళ్లను ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ నాయకత్వానికి ఈ పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది.

# మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశాల వేదికగా 'ఈ అంశం' పై చర్చిద్దామన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ మినహా అన్ని పక్షాలు సమర్థించాయని ఆయన గుర్తు చేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని వివరించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ూష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒక కమిటీని నియమించినట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన పార్టీ నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించిన విషయాన్ని పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే.. తన అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రెస్ మీట్ పెట్టి ఈ అంశాన్ని వివరించాలని నేతలకు సూచించారు. అదే విధంగా త్వరలో ఆ అంశాన్ని ప్రజలకు వివరించేందుకు మూడు ప్రాంతాలు.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి నేతలు నిర్ణయించారు.

# హుగ్లీ నదిలో ప్రధాని విహారం

(మొదటి పేజీ తరువాయి)



గడిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో నదిలో పడవ నడిపేవారితో పాటు, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని ఈసందర్భంగా మోదీ కొనియాడారు. ఎన్నికల్లో గెలిపిస్తే.. పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌవ్‌డా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందన్నారు.

# ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీలు

### హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్

### ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 24 :**
రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్ నియమితులయ్యారు. విజిలెన్స్ డీజీగా డీఎస్ చౌహాన్ బదిలీ అయ్యారు. మల్టిజోన్ 2 ఐజీగా షానవాజ్ ఖాసిం నియమితులయ్యారు. ఆయన పోలీసు పర్సనల్ ఐజీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా తరుణ్ జోషి నియమితులయ్యారు.డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అవినాష్ మొహంతిని నియమిస్తూ, ఆయనకు ఏసీబీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే మల్కాజిగిరి పోలీసు కమిషనర్‌గా బి.సుమతి, ఐజీ కార్తికేయకు ఎస్ఐబీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

------------------

# నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

(మొదటి పేజీ తరువాయి)

99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ఇప్పటివరకు పరిశుభ్రత-పైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, ఆరైవ్- ఆలైవ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి.ఈ నెల 26 వరకు సంక్షేమం పై కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 27 నుండి మే నెల 2 వ తేదీ వరకు పిల్లల భద్రత లో భాగంగా డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయుటకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. మే 4 నుంచి 10 వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అభివృద్ధికి విద్య దిక్సూచిగా నిలుస్తుందనే సంకల్పంతో మే నెల 11 నుంచి 16 వరకు విద్య యొక్క ప్రాధాన్యత, ప్రామాణిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పై విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తారు.

ఆరోగ్య వంతమైన తెలంగాణ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషిస్తుంది. అందులో భాగంగా క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో స్పష్టం చేసేందుకు మే 18 నుంచి 23 వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అలాగే మే 25 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయుటకు చేపట్టిన పథకా లపై కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణం థీమ్ పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని , అభివృ ద్ధి సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచుటకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమనీ ను ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

# చర్చలతోనే పరిష్కారం..

(మొదటి పేజీ తరువాయి)

గత పదేళ్లలో ఆర్టీసీ చిన్నాభిన్నమైందని, అప్పట్లో కార్మికుల పట్ల పాలకులు కఠినంగా వ్యవహరించారని అన్నారు. తాము అలా చేయబోమని భరోసా ఇచ్చారు. వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారం, ఇతర ప్రభుత్వ పనుల వల్ల తాము బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడం వల్లే శంకర్ గౌడ్ ను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని బలోపేతం చేసి, కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ భేటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్ కూడా హాజరయ్యారు.

వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రులు, జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇచ్చారు. ఏ కార్మికుడు కూడా ఆవేశంతో అనాలోచిత నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని జేఏసీ నేతలు పట్టుబట్టారు.

కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు తెలిపారు. మిగిలిన మూడు అంశాలపై అధ్యయనం కోసం కొంత సమయం కావాలని అన్నారు. అయితే ఏయే డిమాండ్లు ఎప్పటిలోగా అమలు చేస్తారో లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

**శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షలు, ఉద్యోగం**

ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది. స్థానిక ఆర్డీవో ఉమారాణి ఆయన మృతదేహానికి ఈరోజు నివాళులర్పించారు. అనంతరం ఈ ప్రకటన చేశారు. పరిహారంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆర్టీసీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, నర్సంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వ్యక్తిగతంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు.

# నర్సంపేటకు వెళుతుండగా, సబితా ఇంద్రారెడ్డి, వినోద్ కుమార్ అరెస్టు

**అరెస్టు చేసి రఘునాథపల్లి స్టేషన్‌కు తరలించిన పోలీసులు**

**పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు**

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**



**నర్సంపేట,మన జనప్రగతి ఏప్రిల్ 24 :**
వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అరెస్టు చేశారు.మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారిని రఘునాథపల్లి పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌కు పెద్ద ఎత్తున చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నర్సంపేట వెళుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను స్టేషన్ ఘనపూర్ పోలీసులు మార్గమధ్యంలో ఆపి, అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఇదిలా ఉండగా, నర్సంపేటలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకువెళ్లడానికి కార్మికులు ప్రయత్నించారు. డిపో వద్ద ఆయనకు నివాళులు అర్పిస్తామని వారు తెలిపారు. అయితే అందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది.శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తరలించి, కార్మికులు ఆయనను కడసారిగా చూసి నివాళులు అర్పిస్తామని చెబుతుంటే పోలీసులకు వచ్చిన ఇబ్బంది ఏమిటని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు, కార్మికుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -04-2026

# షాప్ బాక్సింగ్ లీగ్‌కు 34 మంది క్రీడాకారుల ఎంపిక




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 24 :-** జిల్లా స్థాయి శాప్ బాక్సింగ్ లీగ్స్ పోటీలకు 34 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి భూపతి రావు తెలిపారు. శుక్రవారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూరాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ వారి ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, కర్నూలు వారు జిల్లా స్థాయి శాప్ బాక్సింగ్ లీగ్స్ జూనియర్ అండర్ -15 మరియు అండర్- 19 వయస్సు విభాగాలలో బాలురు మరియు బాలికలకు బాక్సింగ్ పోటీలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అవుట్ డోర్ స్టేడియం లో నిర్వహించామన్నారు. ఈ జిల్లా స్థాయి శాప్ లీగ్స్ బాక్సింగ్ పోటీలలో 34 మంది బాలురు మరియు బాలికలు పాల్గోన్నారని తెలిపారు.ఇందులో గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 28 నుండి 30 ఏప్రిల్ వరకు విశాఖ పట్నం జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి శాప్ బాక్సింగ్ లీగ్స్ పోటీలకు పంపడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, బాక్సింగ్ క్రీడా సంఘము ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు, శిక్షకులు, సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గోన్నారు.

# బీసీ బిడ్డ కుటుంబానికి ఆర్థికసాయం: మంత్రి సవిత



**అమరావతి మన జనప్రగతి ఏప్రిల్ 24:-** రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాలు కోల్పోయిన కడప జిల్లా తొండూరు బీసీ హాస్టల్ విద్యార్థి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బిడ్డ చనిపోతే కన్నతల్లి పడే వేదన వర్ణనాతీతమని, ఆ శోకం నుంచి కోలుకోవడం అసాధ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబానికి తాము ఉన్నామనే భరోసా కల్పించడానికే ఈ చిన్నపాటి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేంపల్లి మండల కేంద్రానికి చెందిన గురు ప్రణీత్ కుమార్(11) తొండూరు బీసీ హాస్టల్ ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడన్నారు. వేసవి సెలవులు ఇవ్వడంతో, అదే హాస్టల్ లో ఎనిమిదో తరగతి చదువుతున్న అన్నయ్య, తల్లితో కలిసి ఆటోలో సొంతూరు పయనమయ్యాడన్నారు. వాటర్ బాటిల్ కొని తిరిగి వస్తుండగా, టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో గురు ప్రణీత్ కుమార్ ప్రాణాలు కోల్పోవడం బాధాకర మన్నారు. పసి ప్రాయంలోనే విద్యార్థి విగతజీవిగా మారడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఇదే విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగానే, బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారన్నారు. త్వరలోనే ఈ ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేస్తామని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




**రాజంపేట మన జనప్రగతి ఏప్రిల్ 24 :-** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు.శుక్రవారం నాడు స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ అనారోగ్య కారణాలతో 24 మంది దరఖాస్తు చేసుకోగా మంజూరైన ₹23,00,00 చెక్కులను బాధితులకు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు గారు అందజేశారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు .అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని,పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.అంతకుముందు ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మాదాసి మాదారి కురువ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శ్యాం బాబు వెంటనే స్పందన




**పత్తికొండ మన జనప్రగతి ఏప్రిల్ 24 :-** పత్తికొండ నియోజకవర్గ పరిధిలో మాదాసి మాదారి కురువ సమస్యల పరిష్కారం కోసం మాదాసి మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం పత్తికొండ నియోజకవర్గం అధ్యక్షుడు కె.పి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్యాం బాబు కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మాదాసి మాదారి కురువకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే శ్యాం బాబు సానుకూలంగా స్పందిస్తూ, అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ కి ఫోన్ చేసి మాదాసి మాదారి కురువ ప్రజల సమస్యలను వివరించి, తక్షణ చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు.దీనిపై జిల్లా కలెక్టర్ కూడా స్పందించి సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాదాసి మాదారి కురువ ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు కార్యకర్తలు కార్యక్రమంలో గౌరవ మైలర్ పత్తికొండ తాలూకా ప్రధాన కార్యదర్శి మంకే లక్ష్మన్న ఉప సర్పంచ్ రాఘవేంద్ర ఎంపీటీసీ చంద్ర బిజెపి మండల అధ్యక్షులు కర్ణం నరేష్ పత్తికొండ అధ్యక్షులు లాలప్ప తుగ్గలి మండలం అధ్యక్షులు ధనుంజయ రాతన రాజు చందోలి సురేంద్ర క్రిష్ణగిరి మండలం అధ్యక్షులు బాల మద్దయ్య మద్దికేర మండలం గడ్డం మల్లికార్జున గుడి తిరుమలేష్ శేషగిరి రంగన్న లక్ష్మన్న బొంత రవి అన్నమేష్‌లు పాల్గొన్నారు.

# దేవనకొండలో బీ.సీ బాలుర వసతి గృహా పున: ప్రారంభానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**దేవనకొండ మన జన ప్రగతి ఏప్రిల్ 24:-**దేవనకొండ మండల విద్యారంగ సమస్యలపై ఆలూరు నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి వైకుంఠం జ్యోతి కి వినతిపత్రం అందజేత దేవనకొండమండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే పునః ప్రారంభించాలని, మండలంలో మోడల్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె. భాస్కర్ కోరారు. గురువారం దేవనకొండకు వచ్చిన ఆలూరు తెదేపా నియోజకవర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి ని కలిసి ఏఐఎస్ఎఫ్ మండల ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మండలం నిత్యం కరువు, కాటకాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కరువు తో పాటు నిరక్షరాస్యత అధికంగా ఉందన్నారు.ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని,వెళ్లే సమయంలో వారి పిల్లల చదువులకై ప్రభుత్వ పాఠశాలల్లో వదిలి వెళ్లడం జరుగుతుందని, మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యయప్రయాసలతో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, చదువుకునేందుకు పాఠశాలలు ఉన్నా, ఉండేందుకు వసతి గృహం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా డి.ఎన్.టి వసతి గృహం ఉండేదని,పక్కా గృహం లేదని, ఇతర కారణాలు చూపి,నిర్వహణ లోపంతో మూసివేయడం జరిగిందన్నారు.వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు టీసి లు తీసుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని, దీంతో అడ్మిషన్లు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో బాలికల వసతి గృహం లేకపోవడంతో కర్నూలు, ఆదోని,హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి బాలికలు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. పలుమార్లు సమస్యలను అధికారులకు విన్నపించినా వాటిని గాలికొదిలేశారని తెలిపారు. దశల వారీ ఉద్యమాల్లో భాగంగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని తెలిపారు. కావున తమరు తక్షణమే స్పందించి మండల కేంద్రంలో మూసివేసిన బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించి,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రవితేజ, సుదర్శన్, హరి,అక్బర్, పురుషోత్తం, శ్రీను, భాస్కర్, పాల్గొన్నారు.



# చంద్రబాబు కంటే పెద్ద వెన్నుపోటుదారుడు బీటెక్ రవి

**సొంత అన్నదమ్ములకే వెన్నుపోటు పొడిచిన చరిత్ర బీటెక్ రవిది**

**వైఎస్ కుటుంబం చలవే పులివెందుల సాగునీరు**


**ఏడాది దాటినా అరటి రైతులకు నయాపైసా ఇవ్వని దద్దమ్మ ప్రభుత్వం**

**లింగాల మండల వైసీపీ నాయకుల ధ్వజం**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 24:-**తెలుగుదేశం పార్టీ నాయకుడు బీటెక్ రవిపై లింగాల మండల వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.చంద్రబాబు కంటే పెద్ద వెన్నుపోటుదారుడు బీటెక్ రవి అని సొంత అన్నదమ్ములకే వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఆయనదని వారు ఎద్దేవా చేశారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కన్వీనర్ బాబు రెడ్డి,రైతు విభాగం అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి తదితరులు పాల్గొని బీటెక్ రవి తీరును తూర్పార బట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పులివెందుల ప్రాంతానికి సాగునీరు అందించిన ఘనత ముమ్మాటికీ వైఎస్ కుటుంబానిదేనని స్పష్టం చేశారు.గతంలో తుంపర డీప్ కట్ వద్ద రైతులు పడిగాపులు కాసినా ఒక్క టీఎంసీ నీరు వచ్చేది కాదని,ఎంపీ అవినాష్ రెడ్డి పాదయాత్రలు చేసి మన నీటి వాటాను సాధించారని గుర్తుచేశారు.గండికోట సామర్థ్యాన్ని 25 టీఎంసీలకు పెంచి సీబీఆర్ లో 10 టీఎంసీల పూర్తి స్థాయి నీటిని నింపిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని వారు కొనియాడారు.పులివెందుల ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకువచ్చింది వైఎస్సార్ కుటుంబమేనని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను గాలికొదిలేశారని నాయకులు విమర్శించారు.గత రెండు నెలలుగా లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లు పనిచేయక రైతులు ఇబ్బంది పడుతున్నా బీటెక్ రవికి చలనం లేదని మండిపడ్డారు.ఎంపీ అవినాష్ రెడ్డి చొరవ తీసుకుంటే తప్ప అధికారులు స్పందించని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గతేడాది ఏప్రిల్‌లో ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి రైతులకు నయా పైసా పరిహారం అందించలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని దుయ్యబట్టారు.అభివృద్ధి చేయడం చేతకాక వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపడమే ధ్యేయంగా బీటెక్ రవి పనిచేస్తున్నారని ఆరోపించారు.మైనింగ్,ఇసుక,లిక్కర్ మాఫియాల ద్వారా కోట్లు గడించిన బీటెక్ రవి తన సొంత కుటుంబ సభ్యులకు వాటా ఇవ్వాల్సి వస్తుందని డబ్బులు లేవు అంటూ కాకమ్మ కబుర్లు చెబుతున్నారని ఇది చంద్రబాబు కంటే పెద్ద వెన్నుపోటు అని పులివెందుల ప్రజలే చర్చించుకుంటున్నారని వారు విమర్శించారు.వివేకా హత్య కేసులో సుప్రీంకోర్టు అవినాష్ రెడ్డి కి క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ ఇంకా ఆ అంశాన్ని పట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సిగ్గుచేటని,షర్మిలమ్మతో కలిసి జిల్లా అంతా తిరిగినా ప్రజలు మీకు బుద్ధి చెప్పారని గుర్తుచేశారు.ఇప్పటికైనా నీచ రాజకీయాలు మానుకొని రైతులకు మేలు చేసే పనులు చేయాలని వారు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో మురారిచింతల మాజీ సర్పంచ్ బాబా హుస్సేన్,గుణకణపల్లి మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి,వైసీపీ నాయకులు నాగేంద్ర రెడ్డి, భూపాల్ రెడ్డి,గంగాధర్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాక్షులను బెదిరించిన కేసులో ఎమ్ఎల్సీ అనంతబాబు అరెస్ట్



**కాకినాడ మన జనప్రగతి ఏప్రిల్ 24:-** కాకినాడ జిల్లాలో సంచలనం సృష్టించిన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసుకు సంబంధించిన సాక్షులను బెదిరించిన ఘటనలో ఎమ్ఎల్సీ పడాల అనంత సత్య ఉదయ భాస్కర రావు అలియాస్ అనంతబాబును సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు ఈ నెల 20న అనంతబాబు తన అనుచరులతో కలిసి సాక్షులను బెదిరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు 21-04-2026 ఉదయం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 155/2026గా కేసు నమోదు చేశారు. ఈ కేసు భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 61(2)(a), 232(1), 351(2), 127(2), r/w 3(5) కింద నమోదు అయింది. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు అనంతబాబును కాకినాడ జిల్లా ప్రత్యేక బృందం అరెస్ట్ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం రాజమండ్రి కోర్టు సమీపంలో ప్రత్యేక దర్యాప్తు అధికారి, తుని రూరల్ సిఐ జి చెన్నకేశవరావు నేతృత్వంలో అనంతబాబును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన కీలక సమాచారం సేకరించిన అనంతరం ముద్దాయిని మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తామని సిఐ చెన్నకేశవరావు తెలిపారు.

# 30న ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్‌ను విజయవంతం చేయాలి: జిల్లా ఇన్చార్జి డిఆర్వో వెంకటపతి



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 24 :**30న కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిసరాల్లోని అదీప్ ల్యాబొరేటరీ యూనిట్ లో నిర్వహిస్తున్న ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ చేపట్టి.. విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి డిఆర్వో వెంకటపతి పేర్కొన్నారు./శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా విపత్తుల నిర్వహపై సంబందిత జిల్లా అధికారులతో.. జిల్లా నించార్జి రెవెన్యూ అధికారి సమీక్షా సమావేశం నిర్వహింహించార్ఈ సందర్భంగా ఇన్చార్జి డిఆర్వో మాట్లాడుతూ... వై.ఎస్.ఆర్ కడప జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల నిర్వహణ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఈ నెల 30వ తేదీన ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహించబనున్నట్లు తెలిపారు.ఈ మాక్ డ్రిల్ ప్రక్రియ.. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని కొప్పర్తి పరిశ్రమల ప్రాంతంలో ఉన్న అడీప్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు సమీపంలోని పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.ఈ మాక్ డ్రిల్ ప్రక్రియలో భాగంగా.. అగ్ని ప్రమాదం, ప్రమాదకర రసాయనాల లీకేజీ వంటి అత్యవసర పరిస్థితులను మోడల్ రూపంలో ప్రదర్శించి, సంబంధిత విభాగాల సమన్వయాన్ని పరీక్షించనున్నారన్నారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పరిశ్రమల ప్రతినిధులు కలిసి స్పందన చర్యలను అమలు చేస్తున్నారన్నారు.మాక్ డ్రిల్ సమయంలో కొప్పర్తి పరిసర ప్రాంతాల్లో భద్రతా కారణాల రీత్యా కొన్ని పరిమితులు అమలులో ఉంటాయన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, అధికారుల సూచనలను పాటిస్తూ ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ మాక్ డ్రిల్ పూర్తిగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగమే అని ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ విన్యాసానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కడప ఆర్డీవో మురళి, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ చీఫ్ చిన్నారావ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, విద్యుత్, ఫైర్, ఆర్టీవో, వ్యవసాయ అనుబంధ శాఖలు తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -04-2026

## బీసీ గళం పోస్టర్లు ఆవిష్కరణ



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 24:-** 26న అనంతపురంలో జరిగే వైఎస్ ఆర్ సి పి బిసిగళం జోనల్ మీటింగ్ కు సంబంధించిన పోస్టర్లను వైసీపీ జిల్లా అధ్య క్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి మాజీ మేయర్ ఫాకా సురేష్ వైసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ బిసి సెల్ విభాగం అధ్యక్షుడు శివరామ్. శివ యాదవ్ లు మాట్లాడుతూ బిసి లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమ లు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వ హిస్తున్న బిసిగళం సభను విజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 139 బీసీ కులాలకు అనేక రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను విస్మరిం చారన్నారు.. 26న జరిగే బిసి గళం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రాయల్ బాబు,మోతుకూరి సుబ్బరాయుడు, శ్రీరంజన్రెడ్డి, వినోద్, శివ పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



**బద్వేలు మన జనప్రగతి ఏప్రిల్ 24:-** రబీ సీజన్‌లో వరి సాగు చేసిన రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈరోజు బద్వేలులో రైతులు ఎంపీని కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మార్కెట్‌లో వరి ధరలు తక్కువగా ఉన్నాయని, మద్దతు ధర లభించడం లేదని వారు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు.రైతుల విజ్ఞప్తిపై ఎంపీ తక్షణమే స్పందించారు.అక్కడికక్కడే జిల్లా కలెక్టర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడారు.ప్రస్తుతం మార్కెట్‌లో 78 కిలోల బస్తా ధర రూ. 1500 మాత్రమే పలుకుతోందని,అదే మద్దతు ధర రూ.1830 గా ఉందని ఆయన కలెక్టర్‌కు వివరించారు.రైతులు నష్టపోకుండా ఉండాలంటే వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి,మద్దతు ధరకు పంటను సేకరించాలని సూచించారు.ఎంపీ విజ్ఞప్తికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతు ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నూతన సీఐ వెంకటేశ్వర్లును కలిసిన టీడీపీ నాయకులు



**సిద్దవటం మన జనప్రగతి ఏప్రిల్ 24:-** ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును సిద్ధవటం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంటిమిట్టలోని సి.ఐ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడమే కాకుండా, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సి.ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఏదైనా శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రామాలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండేలా చూడటంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి, రాష్ట్ర దూదేకుల సంక్షేమ ఫైనాన్స్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు దశరథ నాయుడు పాల్గొన్నారు. అలాగే నిత్య పూజేశ్వర కోన ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్రయ్య, టీడీపీ యువనేతలు ప్రతాప్ నాయుడు, హరి తదితరులు పాల్గొని సీఐకి శుభాకాంక్షలు తెలిపారు.

# హోమ్ గార్డుల ఆదర్శం


- పదవీ విరమణ పొందిన మహిళా హోమ్ గార్డుకు రూ. 4,06,120 ఆర్థిక సాయం
- జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ చేతుల మీదుగా అందచేత
- హోమ్ గార్డుల ఐకమత్యాన్ని అభినందించిన జిల్లా ఎస్.పి



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 24:-** మానవత్వం, ఐకమత్యం కేవలం మాటల్లోనే కాదని జిల్లాలోని హోమ్ గార్డులు నిరూపించారు. తమతో కలిసి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన మహిళా హోమ్ గార్డుకు అండగా నిలబడి అభినందనలు అందుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఏ.ఆర్ విభాగంలో హోమ్ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల జి.లక్ష్మీదేవి( డబ్ల్యు. హెచ్.జి 475) పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెకు తమ వంతు సాయం అందించేందుకు జిల్లాలోని హోమ్ గార్డులందరూ ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా ఒకరోజు వేతనాన్ని వితరణగా ఇచ్చి పోగు చేసి రూ. 4,06,120 సేకరించారు.ఈ ఆర్థిక సాయాన్ని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్.పి జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ చేతుల మీదుగా రూ.4,06,120 చెక్కును జి.లక్ష్మీదేవికి అందచేశారు. ఈ సందర్భంగా హోమ్ గార్డుల ఐకమత్యాన్ని, వారి గొప్ప మనసును జిల్లా ఎస్.పి ప్రత్యేకంగా అభినందించారు. పదవీ విరమణ పొందిన హోమ్ గార్డు జి.లక్ష్మీదేవి కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ శ్రీశైల రెడ్డి పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లాకు 'కాటమరాజు జిల్లా' నామకరణం చేయాలి: యాదవ సంఘాల పిలుపు






**మార్కాపురం,మన జనప్రగతి ఏప్రిల్ 24:-**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యాదవులందరికీ అఖిల భారత యాదవ మహాసంఘం తరఫున కీలక పిలుపు నిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని యాదవ సోదరులు నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు 'కాటమరాజు జిల్లా'గా నామకరణం చేయాలని వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల్లో తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తపరచడం ద్వారా అవగాహన పెరుగుతుందని, అయితే ప్రత్యక్షంగా కార్యాచరణలో పాల్గొనడం మరింత అవసరమని సూచించారు. ముఖ్యంగా మార్కాపురం జిల్లాలోని ఎర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో ఉన్న యాదవ సోదరులతో సంప్రదింపులు జరిపి, కాటమరాజు జిల్లా సాధన సమితితో కలిసి ఒక నిర్ణీత తేదీని ఖరారు చేసి, మార్కాపురంలో సమావేశమై కార్యాచరణకు రూపకల్పన చేయాలని పిలుపునిచ్చారు."మాటలు చెప్పడం సులభం, కానీ ఆచరణలోకి దిగడం కష్టం" అనే విషయాన్ని గుర్తించాలని, జిల్లాలోని యాదవుల్లో 'కాటమరాజు జిల్లా' సాధనపై బలమైన ఆకాంక్ష ఉందని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు కేవలం పోస్టులు పెట్టడమే కాకుండా, స్థానిక యాదవ సంఘాలతో ఫోన్ ద్వారా సంప్రదించి కార్యాచరణకు సహకరించాలని కోరారు.ఇలాంటి ప్రకటనలు మాత్రమే కాకుండా, ప్రత్యక్షంగా కలిసి శాంతియుతంగా పోరాటానికి సిద్ధమవుతూ, తమ కోరిక సాధనకు సూచనలు, సలహాలు అందించాలని యాదవ సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

# ఇల్లాలు.. ప్రియుడు.. ఓ రౌడీషీటరు

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడే కారణంతో...
- భర్తను అంతమొందించేందుకు ఓ భార్య పన్నాగం పన్నింది





**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి ఏప్రిల్ 24:-**వివాహేతర సంబంధానికి అడొస్తున్నాడే కారణంతో భర్తను అంతమొందించేందుకు ఓ భార్య పన్నాగం పన్నింది. ప్రియుడు, మరో రౌడీషీటర్తో కలిసి కిరాతకంగా హతమార్చాలని కుట్ర పన్నింది. చివరికి పోలీసులకు చిక్కడంతో బెడిసికొట్టి అసలు విషయాలు వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.**సుపారీ కోసం ప్రియుడికి బంగారమిచ్చిన భార్య.**పరిచయం.. ఆపై వివాహేతరం: ప్రొద్దుటూరు మండలం లింగాపురం చెందిన ఈశ్వర్రెడ్డి, శిల్పారెడ్డి దంపతులు. వీరికి పదిహేళ్ల క్రితం వివాహమైంది.కొన్నిరోజులుగా వారి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో శిల్పారెడ్డికి ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న జమ్మలమడుగుకు చెందిన దాసరిగాళ్ల నాగసుధీర్(వివాహితుడు) అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అదికాస్తా వివాహేతర సంబంధంగా మారింది. విషయం భర్త ఈశ్వర్రెడ్డికి తెలియడంతో భార్యను పలుమార్లు మందలించారు. దీంతో తమ సంబంధానికి అడ్డుగా ఉన్న అతన్ని తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ప్రియుడు నాగసుధీర్ కూడా అందుకు ఒప్పుకొన్నాడు. రాజుపాళేనికి చెందిన రౌడీషీటర్ వినయ్కు విషయాన్ని తెలిపాడు. అతని ద్వారా సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన కిరాయి ముఠాకు రూ. 10 లక్షలు సుపారీ ఇచ్చి ఈశ్వర్రెడ్డి హత్యకు ప్రణాళికలు రూపొందించారు. **నగదుకు 14 తులాల బంగారం అమ్మకం:** సుపారీకి అవసరమైన నగదు సమకూర్చేందుకు శిల్పారెడ్డి దాదాపు 14 తులాల బంగారాన్ని ప్రియుడికి ఇచ్చింది. నాగసుధీర్ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో కొంత విక్రయించి, మరికొంత కుదువ పెట్టి డబ్బు తీసుకున్నాడు. అందులో దాదాపు రూ. 5 లక్షల వరకు కిరాయి ముఠాకు సుపారీ ఇచ్చాడు. మిగిలిన మొత్తం పనిపూర్తయిన తర్వాత ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడు. ఇంతలో ప్రియుడు, భార్య హంతక ముఠా అందరూ పోలీసులకు చిక్కి కటకటాలు లెక్క పెడుతున్నారు. ఈ విషయాన్ని ప్రొద్దుటూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విభూకృష్ణ ఐపీఎస్ పాత్రికేయ సమావేశం లో ముద్దాయిలను ప్రవేశపెట్టి కేసు పూర్తి వివరాలను పత్రిక ముఖంగా వెల్లడించారు. ఈ కేసులో ముఖ్య పాత్ర పోషించిన వన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, సిఐ కొండారెడ్డి వారి సిబ్బందిని ఏఎస్పి అభినందించారు.

## ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించండి: ఇంచార్జి కమిషనర్ శారదా దేవి




**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 24:-** నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి రోజు నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించి, ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలని ఇంచార్జి కమిషన్ శారదా దేవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని తాతయ్యగుంట, మల్లయ్యకుంట కట్ట, గోదాదేవి మార్గం, అంకురా రోడ్డు తదితర ప్రాంతాలను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, హెల్త్ అధికారులతో కలసి ఇంచార్జి కమిషనర్ పరిశీలించారు. కాలువల్లో చెత్త ఎక్కువగా ఉందని, నీరు తగినన్ని సరఫరా చేయాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని, ప్రజలకు సరిపడేన్ని నీరు సరఫరా చేయాలని తెలిపారు. అలాగే ప్రతి రోజు నీటి సాంద్రత పరీక్షలు చేయాలని తెలిపారు. రుతుపవనాల వల్ల వర్షాలు రానున్నాయని కాలువల్లో ఎక్కడా మురుగునీరు నిలవకుండా సిల్ట్ తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను తొలగించి, ప్లాట్ వారికి నోటీసులు ఇచ్చి, నగదు వసూలు చేయాలని సూచించారు. గంగమ్మ ఆలయం వద్ద పారిశుధ్య పనులను పరిశీలించి, జాతరలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. స్వీయ గణన వేగవంతం చేయాలని సచివాలయం కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. ఇంచార్జి కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, డి.ఈ.లు రాజు, లలిత, ఏసీపీ లు మూర్తి, పార్వతి ప్రియ, రెవిన్యూ అధికారులు, సచివాలయ, పారిశుధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## మార్కాపురంలో నూతన గృహప్రవేశం వంకేశ్వరం శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు




**మార్కాపురం మన జనప్రగతి ఏప్రిల్ 24:-** మార్కాపురంలోని కమల హ్యాపీ హోమ్స్‌లో శుక్రవారం నూతన గృహప్రవేశం సందర్భంగా మార్కాపురం జిల్లా బీసీ భవన్ కమిటీ కోశాధికారి, యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు వంకేశ్వరం శ్రీనివాస్ ని బీసీ భవన్ కమిటీ సభ్యులు కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, 2011 ఏప్రిల్ 11న ఏర్పడిన మార్కాపురం బీసీ భవన్ సాధన కమిటీలో శ్రీనివాస్ కీలక బాధ్యతలు నిర్వహిస్తూ, డివిజన్‌లోని బీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. సమాజ సమస్యలపై చిత్తశుద్ధితో స్పందిస్తూ సలహాలు, సూచనలు అందిస్తూ ముందుండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు.ఈ సందర్భంగా పిఎల్పి యాదవ్ మాట్లాడుతూ, వంకేశ్వరం శ్రీనివాస్ నాయి బ్రాహ్మణ సమాజానికి మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి అని అభిప్రాయపడ్డారు. ఆయనతో పాటు శ్రీనివాస్ దంపతులు సాదాసీదా జీవనశైలి, మంచి మనసుతో అందరితో గౌరవప్రదమైన సంబంధాలు కొనసాగిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామి గౌడ్, కలవకూరి అబ్రహం, రాజ్ కుమార్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, నారాయణ గౌడ్, నాగార్జున గౌడ్, రమణ, అల్లూరయ్య గౌడ్, నాగం వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ రామలింగ చౌడేశ్వరి ఆలయంలో వైభవంగా బగళాముఖి జయంతి వేడుకలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 24:-**పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు,చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు.బగళాముఖి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ,పంచామృతాభిషేకం,కుంకుమార్చన మరియు మహా మంగళహారతి నిర్వహించారు.అనంతరం అమ్మవారిని రంగురంగుల పుష్పాలతో మనోహరంగా అలంకరించారు.బగళాముఖి జయంతి సందర్భంగా ఉదయం 10:30 గంటలకు భక్తులు రాహుకాల దీపాలు,కూష్మాండ (గుమ్మడి కాయ) దీపాలు,పసుపు రంగు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.అష్టమి,పౌర్ణమి,అమావాస్య వంటి విశేష దినాల్లో అమ్మవారికి 108 ప్రదక్షిణలు చేస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పసుపు కుంకుమార్చనలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణమంతా అమ్మవారి నామస్మరణతో మారుమోగింది.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు పట్టణ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

## బద్వేలులో ఘనంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ





**బద్వేలు మన జనప్రగతి ఏప్రిల్ 24:-**బద్వేలు పట్టణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా,ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మరియు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.విగ్రహావిష్కరణ అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సమానత్వం కోసం,అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు.నేడు దేశంలో ప్రతి ఒక్కరూ ఎంతో స్వేచ్ఛగా,సమాన హక్కులతో జీవిస్తున్నారంటే అది అంబేద్కర్ రచించిన గొప్ప రాజ్యాంగం వల్లనే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన చూపిన బాటలో నడవడం మనందరి బాధ్యతని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -04-2026

# అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులను విద్య ఆటల పోటీల్లో చైతన్య పరచడం లక్ష్యం

● కడప ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి



**చెన్నూరు, మన జనప్రగతి ఏప్రిల్ 24:-** అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులను విద్య ఆటలు పోటీల్లో చైతన్య పరచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కడప ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి తెలిపారు, చెన్నూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శు క్రవారం“ప్రీ స్కూల్ పిల్లలకు సంసిద్ధత ఉత్సవం” కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు త్రీ ప్లస్ ఫోర్ ప్లస్ పిల్లలకు గత సంవత్సరం మొత్తం చెప్పిన సిలబస్ సంబంధించి ప్రీ టెస్ట్ నిర్వహించారు. పిల్లల తల్లుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ పిల్లలకు వివిధ రకాల కృత్యాలపై టెస్టులు నిర్వహించామన్నారు. శారీరక మేధ భాష గణితం సాంఘికం అభివృద్ధిలో సంసిద్ధత టెస్ట్ నిర్వహించామన్నారు చివరిలో రిపోర్టు కార్డు తల్లులకు ఇచ్చి ప్రతి పిల్లవారికి స్థాయిలో సాధించిన ప్రగతిని వివరించారు. వెనకబడిన తరగతుల పిల్లలు తల్లులు ఇంటిదగ్గర వస్తువులతో ఎలాంటి కృత్యాలు నిర్వహించాలో సూచించారు. జిల్లా ఐ టి సి కోఆర్డినేటర్ స్వరూప రాణి. ఎంపీడీవో. కిరణ్ మోహన్ రావు. హెడ్మాస్టర్. ఆర్ వెంకటసుబ్బయ్య. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు. బి విజయభాస్కర్ రెడ్డి. అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు చిన్నారులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా పనిచేయండి

## చెన్నముక్క పల్లెను ప్రగతి పథంలో నడిపించండి

## టిడిపి యువనాయకులు మౌర్యా రెడ్డి



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 24:-** రాయచోటి పట్టణంలోని చిన్నముక్కపల్లి గ్రామంలో అంతర్జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవ మాట్లాడుతూ కలిసి కట్టుగా పని చెయ్యండి.. చెన్నముక్క పల్లి గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించాలని నేతలకు పిలుపు నిచ్చారు.మంత్రి రాంప్రసాద్ రెడ్డి మేనల్లుడు మౌర్యా రెడ్డి.అంతర్జాతీయ పంచతారాజ్ దినోత్సవం ను పురస్కరించుకొని రాయచోటి మండలం చెన్నముక్క పల్లి గ్రామం కొలిమిట్ట నందు ఎంపీడీవో,స్పెషల్ అధికారిని పరిపూర్ణ అరుంధతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభ కార్యక్రమంలో అతిథిగా మౌర్యా రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో చెన్నముక్క పల్లి గ్రామానికి కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు.ఎన్నికల సమయంలో ప్రతి హామీని కూడా నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు.అదే విధంగా ఈ గ్రామంలో నెలకొన్న సమస్యలను కూడా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలను కూడా ప్రజలకు చేరువచేశామని ప్రజలకు వివరించారు.ముస్లిం ప్రజలు అధికంగా ఉన్నారని,వారి బిడ్డల కోసం ఉర్దూ స్కూల్ కావాలన్నారు అది కూడా మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్ళి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.నీటి సమస్య ఉన్నటువంటి ప్రాంతాలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని నేతలకు సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరికి నివాస గృహాలు,పింఛన్ లు త్వరలో నే మంజూరువుతాయని ఆయన యువనేత మౌర్యా రెడ్డి పేర్కొన్నారు.ఎంపీడీవో,స్పెషల్ అధికారిని మాట్లాడుతూ గ్రామంలో కొన్ని సమస్యలు ఉన్నాయనయని ఆ సమస్యలను కూడా స్థానిక నేతలతో మా అధికార యంత్రాంగం సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తమ గ్రామానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,డాక్టర్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి,మౌర్యా రెడ్డి ల నేతృత్వంలో నియోజకవర్గంలోనే చెన్నముక్క పల్లి గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరం పనిచేస్తామని నేతలు స్పష్టం చేశారు... యూనిట్ అధ్యక్షులు కొండా రెడ్డి,మాజీ అధ్యక్షులు మురికినాటి సుబ్బారెడ్డి,సాహూద్, ప్రభాకర్ రెడ్డి,పంచాయతీ సెక్రెటరీ జయశ్రీ , ఉమామహేశ్వర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాజన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ప్రగతి రథసారధులు

● 11 మంది సేవకులకు ఘన సన్మానం!



**ఉరవకొండ:మన జనప్రగతి ఏప్రిల్ 24 :-** గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు“ అన్న గాంధీజీ మాటలను నిజం చేస్తూ, అంకితభావంతో సేవలందిస్తున్న పంచాయతీ సిబ్బందిని గౌరవించుకోవడం మన కర్తవ్యం. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీలో ఒక అద్భుతమైన వేడుక జరిగింది. నిరంతరం ప్రజా సేవలో తరిస్తూ, పంచాయతీ అభివృద్ధికి తోడ్పడుతున్న 11 మంది సిబ్బందిని ఎంపీడీఓరవి ప్రసాద్, ఈఓ ఆర్డీ సతీష్ కుమార్ అధికారులు, ప్రజలు ఘనంగా సన్మానించారు.సేవలో అగ్రగామి: సీనియర్ ఎలక్ట్రీషియన్ గోపాల్ఈ సన్మాన గ్రహీతల్లో అందరి దృష్టిని ఆకర్షించింది సీనియర్ ఎలక్ట్రీషియన్ ఉక్కిసుల గోపాల్. పంచాయతీ పరిధిలో వీధి దీపాల నిర్వహణలోనూ, విద్యుత్ సమస్యల పరిష్కారంలోనూ ఆయన చూపుతున్న చొరవ అమోఘం. నిబద్ధతతో పని చేస్తూ సేవల్లో ఆయన మొదటి వరుసలో నిలిచారు.సత్కారం పొందిన సేవా మూర్తులుఎలాంటి అపశ్రుతులు లేకుండా, ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తున్న కింది సిబ్బందిని ఎంపీడీవో మరియు ఈవో ఆర్.డి.లు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు ఉక్కీసుల గోపాల్ (సీనియర్ ఎలక్ట్రీషియన్)ఆంజనేయులుశేషాద్రి సుబ్రహ్మణ్యం (బోరు మెకానిక్)శైలజ మల్లమ్మ మారెప్ప నాగరాజు (బిల్ కలెక్టర్)రవి కుమార్ (బిల్ కలెక్టర్) వీరితో పాటు మరో ఇద్దరు సిబ్బంది కలిపి మొత్తం 11 మంది గౌరవ పురస్కారాలు అందుకున్నారు.అధికారుల ప్రశంసలుఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది పడుతున్న శ్రమ వల్లే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి, అంకితభావంతో పనిచేసే ఇలాంటి ఉద్యోగులు ఇతరులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ముగింపు:తమ కష్టానికి గుర్తింపు లభించడంతో సన్మానం పొందిన సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన సేవలతో పంచాయతీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని వారు ప్రతిన పూనారు. నిస్వార్థ సేవకు దక్కిన ఈ గౌరవం నిజంగా స్ఫూర్తిదాయకం!

# ప్రకృతి వ్యవసాయ కన్వర్జెన్స్ శిక్షణ విజయవంతం



**గాలివీడు మన జనప్రగతి ఏప్రిల్ 24:-** అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గోపనపల్లి గ్రామంలోని ఆర్ఎస్కే పరిధిలో మండల వ్యవసాయ అధికారి గౌతమి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల మండల స్థాయి కన్వర్జెన్స్ శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు శిక్షణ విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వివిధ మోడళ్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గౌతమి మాట్లాడుతూ హాఫ్ మూన్ మోడల్ మరియు డీఆర్పీఎం (డ్రౌట్ ప్రూఫింగ్ మోడల్) గురించి వివరంగా తెలియజేశారు. ఈ మోడళ్ల ద్వారా వర్షాధార భూముల్లో నీటి సంరక్షణ, నేల తేమ నిలుపుదల మరియు పంటల ఉత్పాదకత పెంపు ఎలా సాధ్యమవుతుందో వివరించారు. అదేవిధంగా ఎల్నినో ప్రభావం నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. పీఎండీఎస్ (మాన్సూన్‌కు ముందు విత్తనాల చల్లే పద్ధతి) ప్రాముఖ్యతను తెలియజేస్తూ, వర్షాలు పడకముందే విత్తనాలు చల్లడం ద్వారా పంటల సాగు సులభంగా సాగుతుందని పేర్కొన్నారు. వర్షాధార భూముల్లో పంటల ఎంపిక మరియు సాగు విధానాలపై కూడా మార్గదర్శకాలు ఇచ్చారు. ఎంటీ వెంకట జ్యోతి మాట్లాడుతూ వేరుశనగ పంటలో ఫీల్డ్ విజిట్స్ నిర్వహిస్తూ, ప్యాకేజ్ ఆఫ్ ప్రాక్టీసెస్ గురించి వివరించారు. అలాగే విత్తనాల పెల్లెటైజేషన్ పద్ధతి వల్ల కలిగే ప్రయోజనాలు, ఘన జీవామృతం మరియు ద్రవ జీవామృతం వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన చేసి చూపించారు. మధ్యాహ్నం తరగతిలో ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని డీఆర్పీఎం, పీఎండీఎస్, వేరుశనగ మోడల్, మామిడి తోటలలో పీఎండీఎస్ మోడళ్లు ఎలా అమలు చేయాలో వివరించారు. అదేవిధంగా ఆర్ఎస్కే పరిధిలో వీఏఏ మరియు ఐసీఆర్పీ లతో కలిసి పంటల సరళి మరియు ప్రస్తుత సాగు పరిస్థితులపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో గాలివీడు మండలానికి చెందిన అగ్రికల్చర్ సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# అవగాహన లేని వైసీపీ దళిత నేతల వ్యాఖ్యలు: దళితుల 27 పథకాలను ఎగ్గొట్టిన జగన్





**కాకినాడ, మన జనప్రగతి ఏప్రిల్ 24:-** కాకినాడ నగరంలో సుమారు 4ఏళ్ల క్రితం డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత బాబుకు ఆశ్రయం ఇచ్చింది అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అని వైసీపీ దళిత నాయకులు తెలుసుకోవాలని టీడీపీ నగర దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ దళిత నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు అంబటి చిన్నా, మాజీ కార్పొరేటర్లు పలివెల రవి అనంత కుమార్, సీకోటి అప్పలకొండ మాట్లాడారు. దళితుల సంక్షేమానికి టిడిపి హయాంలో ఎనలేని కృషి జరిగిందన్నారు అందులో భాగంగా 27 పథకాలను దళితుల అభివృద్ధి కోసం టిడిపి ప్రభుత్వం అమలు చేయగా తర్వాత అధికారులకు వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దుచేసి దళితులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అనంత బాబుపై కేసు నమోదు చేయించడంలో టీడీపీ నేతలు గట్టిగా పోరాటం చేశారన్నారు. అందువల్లే దళితుడిని హత్య చేసిన అనంతబాబుకు పోలీసులు అదుపులోకి తీకున్నారన్నారు. వైసిపి హయాంలో దళితులు ఎంతో మందిని హత్య చేశారని వారికి టీడీపీ తగు పరిహారం అందించి న్యాయం జరిగేలా నేటికీ పోరాడుకున్నారు. దళితులకు జాతీయ స్థాయిలో ఉన్నత పదవులు కూడా టీడీపీ ఇచ్చి వారిని గౌరవించిన సంగతిని వైసీపీ వారు తెలుసుకోవాలన్నారు. స్థానికులనుభయ భ్రాంతులకు గురి చేస్తున్న వైసీపీకి చెందిన నగర నాయకుడు బల్లా సూరిబాబు పైన రౌడీషీట్ ఉందని అతనిపై జిల్లా పోలీసులు శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2003లో కాకినాడ గోదారి గుంట ప్రాంతంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే కూలగొట్టిన నీచ చరిత్ర సూరిబాబుకు ఉందన్నారు. వైసీపీ దళిత నాయకులు నిజాలు తెలుసుకుని తమపై విమర్శలు చేయాలని లేని పక్షంలో హీనులు అవుతారని చెప్పారు. రాజమహేంద్రవరంలో హత్య కేసులో నిందితుడిగా ఉన్న అనంతబాబుని పోలీసులు అరెస్టు చేయడం పట్ల వారుహర్షం చేశారు.బంగారు సత్తిబాబు, పోలిపల్లి జగన్, సమయమంతుల రాజు పాల్గొన్నారు..

# అక్రమ పశువధపై వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలి

● జీహెచ్ఎంసీని ఆదేశించిన హైకోర్టు

● తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



**హైదరాబాద్ మన జనప్రగతి ఏప్రిల్ 24:-** గ్రేటర్ హైదరాబాద్ నగర పరిధిలో పశువుల అక్రమ రవాణా, పశువధకు సంబంధించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ జీహెచ్ఎంసీ కమీషనర్, జీహెచ్ఎంసీ (చార్మినార్ జోన్) డిప్యూటీ కమీషనర్ ను ఆదేశించారని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ తెలిపారు. ఈ రిట్ పిటీషన్ ను తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కాచిగూడ లోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ చట్టంలోని వివిధ నిబంధనలను అమలు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం... ఇబ్బంది కలిగించే విధంగా జంతువులను ఉంచడం, కమిషనర్ లిఖితపూర్వక అనుమతి లేకుండా మానవ వినియోగం కోసం పశువులను నగరంలోకి తీసుకురావడం నిషిద్ధమని అన్నారు. వేలాది పశువులను అనుమతి లేకుండా నగరంలోకి తీసుకువచ్చి అక్రమంగా వధిస్తున్నారని గోశాల ఫెడరేషన్ తరపున న్యాయవాది జిఎల్ నరసింహారావు వాదించారని ఆయన పేర్కొన్నారు. పదేపదే విన్నవించుకున్నప్పటికీ, ముఖ్యంగా బక్రీద్ సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఒక సంక్షిప్త నివేదికను కోర్టు ముందు ఉంచాలని న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారని ఆయన తెలిపారు.

# హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడిగా దివాకర్ రెడ్డి నియామకం



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 24:-** వేంపల్లె మండల హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన వల్లూరు దివాకర్ రెడ్డిని నియమించారు. జాతీయ అధ్యక్షుడు నందం నరసింహ రావు ఆదేశాల మేరకు, కడప జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్ వల్లూరు దివాకర్ రెడ్డికి శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, పేదలు మరియు బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు. అక్రమాలు, అవినీతి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ, బాధితులకు న్యాయం చేయడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.తనకు పదవి ఇచ్చేందుకు సహకరించిన జాతీయ అధ్యక్షుడు నందం నరసింహ రావుకు, జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరిక



**ఒంటిమిట్ట మన జనప్రగతి ఏప్రిల్ 24:-** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా సహించేది లేదని ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ.. ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల్లో భూ అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ డీకేటీ భూములను, నిరుపేదల ఇళ్ల స్థలాలను కబ్జా చేసి గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. నేషనల్ హైవేపై ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన పేర్కొన్నారు.

# టక్కోలిలో ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

- గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం



**సిద్ధవటం మన జనప్రగతి ఏప్రిల్ 24:-** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలను ఏర్పాటు చేసిందని మండల స్పెషల్ ఆఫీసర్ ఆకుల తిరుమల బాబు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా టక్కోలి గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాజీపల్లె హౌసింగ్ కాలనీలో నెలకొన్న త్రాగునీటి సమస్యపై ప్రజలు విన్నవించగా, దానిని తక్షణమే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, జనసేన నేత జగన్ మోహన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# దర్గా ఉరుసు ఉత్సవానికి సుగవాసి ప్రసాద్ బాబుకి ఆహ్వానం

**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 24 :-** రాయచోటి పట్టణం బండ్లపెంటలో వెలిసిన శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ యూసుఫ్ షా ఖాదిరి కుతుబ్ (దివానే సాహెబ్) దర్గా లో నిర్వహించనున్న 01-05-2026 గంధం కార్యక్రమం02-05-2026 ఉరుసు ఉత్సవంకార్యక్రమాలకు హాజరుకావాలని కోరుతూ దర్గా కమిటీ సభ్యులు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు షేక్ ఇషాక్, మహబూబ్ వలి, సాధిక్, ఉబెద్ తదితరులు పాల్గొన్నారు.ఉరుసు ఉత్సవం విజయవంతం కావాలని, భక్తులకు శాంతి-సౌఖ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాము.



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
25 -04-2026

## చెన్నూరు ఎంపీడీవో బి. కిరణ్ మోహన్ రావుకు ప్రశంసాపత్రం



**చెన్నూరు మన జనప్రగతి ఏప్రిల్ 24:-** చెన్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) బి. కిరణ్ మోహన్ రావు తన విధి నిర్వహణలో కనబరిచిన అంకితభావానికి ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. 2026వ సంవత్సరంలో ఆయన అందించిన విశేష సేవలకు గాను, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆయనను ప్రశంసాపత్రంతో సత్కరించింది. శుక్రవారం కడపలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో 'జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం-2026' వేడుకలు ఘనంగా జరిగాయి. క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, ప్రజలకు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా చేరువ చేస్తున్న ఉత్తమ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఈ సందర్భంగా ప్రోత్సహించింది. ఇందులో భాగంగా.. వైఎస్సార్ కడప జడ్పీపీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చేతుల మీదుగా కిరణ్ మోహన్ రావు ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తూ, చెన్నూరు మండల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి దక్కిన ఈ గౌరవం పట్ల తోటి అధికారులు, పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## మహాభారత యజ్ఞంలో అన్నదాన కార్యక్రమం



**రామాపురం మన జనప్రగతి ఏప్రిల్ 24: -** రామాపురంలో గత మూడు రోజులు పాటు జరుగుతున్న మహాభారతాయజ్ఞంలో శుక్రవారం మహాభారతానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు మహాభారత కమిటీ సభ్యులైన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు శుక్రవారం నుంచి 13 రోజులపాటు మహాభారతానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి భక్తవత్సల రెడ్డి దామోదర నాయుడు ప్రసాద్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజుని కలిసిన నూతన ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు



**రాజంపేట మన జనప్రగతి ఏప్రిల్ 24:** రాజంపేట పార్టీ కార్యాలయం నందు ఇటీవల ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజుకి పుష్పగుచ్ఛం అందజేసి కలిశారు.మండల వ్యాప్తంగా శాంతిభద్రతలను పరిరక్షించాలని,శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలని,సి.ఐ కి చమర్తి జగన్ మోహన్ రాజు సూచించారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

- ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి
- మండల వ్యవసాయ అధికారి సాయికుమార్



**బొమ్మనహాళ్ మన జనప్రగతి ఏప్రిల్ 24:-** వాతావరణ నిపుణుల అంచనా ప్రకారం 2026 లో ఎల్ నినో ప్రభావం వల్ల ఖరీఫ్ సీజన్ లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ తెలిపారు, ఈ సందర్భంగా ఏఓ సాయికుమార్ మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందస్తు సాగు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ప్రకృతి వ్యవసాయ బాట పట్టడం అవసరం,కావున క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్,హాఫ్ మూన్ మాడల్ నమూనా,మరియు వ్యవసాయ పంటల నుండి ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలి.ప్రతి రెవెన్యూ గ్రామంలో దాదాపు 200 హెక్టార్ల వరకు సాగులోకి వచ్చేలా చూడాలి.వ్యవసాయ శాఖ మరియు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అనుబంధ శాఖలు ఉద్యాన శాఖ ద్వారా ఈ విధానాలు అవలంబించాలని తెలియజేయడమైనది.ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సాగు పద్ధతి ద్వారా పంట కాలానికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందు 20 నుంచి 30 రకాల వివిధ పంటల విత్తనాలను కలిపి వెదజల్లి,నాటి సాగు భూమిని సజీవ వేరు వ్యవస్థతో ఎల్లప్పుడూ కప్పబడి ఉండే ఈ ప్రక్రియ,365 రోజులు భూమి పంటలతో కప్పబడి ఉండాలనే వ్యూహంతో ముఖ్య భూమిక పోషిస్తుంది.హాఫ్ మూన్ మోడల్ నమూనా ద్వారా వాలుగా ఉండే పొలాల్లో ,బీడు భూముల్లో ,అర్ధ చంద్రకారపు కండకాలను తవ్విస్తే వర్షపు నీరు ఇంకిపోయి రైతుల యొక్క పొలాలు ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలపడం అయినదనీ,ఈ పద్ధతుల ద్వారా తక్కువ వర్షపాతంతో కూడా మంచి దిగుబడులు సాధించవచ్చు మరియు ఎటువంటి రసాయన పురుగు మందులు అవసరం లేదు కేవలం ఘన,ద్రవ జీవామృతములతో ప్రకృతి వ్యవసాయం చేసుకున్నట్లయితే ఎటువంటి చీడపీడలు కూడా ఆశించకుండా పంటను కాపాడుకోవచ్చును.సాగునీరు అందుబాటులో ఉన్న రైతులను వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటలైన ఆయిల్ పామ్, దానిమ్మ, మామిడి వైపు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ సుధాకర్,పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న పులివెందుల వెలమవారిపల్లి పాత రోడ్డు

- మురుగు నీటిలోనే ప్రయాణం, దుర్వాసనతో అవస్థలు
- వ్యాధుల భయంతో స్థానికుల ఆందోళన



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 24:-** పులివెందుల పట్టణంలోని పాత వెలమవారిపల్లి రోడ్డులో డ్రైనేజీ సమస్య అధ్వానంగా తయారైంది.డ్రైనేజీ మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తూ చెరువును తలపిస్తోంది.మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్లపై మురుగునీరు నిలవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది.నిలిచిన నీటిలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని,దీనివల్ల డెంగ్యూ,మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపైకి రావడంతో పాదచారులు నడవలేకపోతున్నారు. వాహనదారులు కూడా బురదమయమైన రోడ్డుపై ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మున్సిపల్ సిబ్బంది అప్పుడప్పుడు వచ్చి డ్రైనేజీని మరమ్మత్తులు చేసినప్పటికీ,రెండు రోజుల్లోనే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు ఆలోచించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.వ్యాధులు వ్యాపించకముందే ఉన్నతాధికారులు స్పందించి,పాత వెలమవారిపల్లి రోడ్డులోని డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆ ప్రాంత నివాసితులు డిమాండ్ చేస్తున్నారు.

## కౌన్సిల్ తీర్మానం మేరకు సిసి రోడ్,యూజీడి నిర్మాణ పనులు

- సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం
- మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 24:-** పులివెందుల నారాయణ కాలేజ్ ప్రాంతంలో యుజీడి, సిసి రోడ్ వంటి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి హామీ ఇచ్చారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో నారాయణ కాలేజీ సమీపంలో ఉన్నటువంటి ఆ ప్రాంతవాసులు సీసీ రోడ్డు నిర్మాణం యు జి డి సమస్యలను మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి దృష్టికి గతంలో తీసుకరావడం జరిగింది. ఈ సమస్యలపై కౌన్సిల్ తీర్మానం మేరకు ప్రారంభించడం జరిగిందని,సిసి రోడ్లు,యు జి డి పనులను నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రజలకు సేవలు అందించేందుకు పదవులే అవసరం లేదని ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా అధ్యక్షుడు హల్ గంగాధర్ రెడ్డి,ఉపాధ్యక్షుడు పార్లపల్లి కిషోర్,వైసిపి నాయకులు తోటం శెట్ట హరి,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ఆరోగ్యాధికారి విస్తృత తనిఖీలు



**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 24:-** నగరంలోని వివిధ హోటల్స్, ఫుడ్ సెంటర్లపై నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ యువ అన్వేష్ నేతృత్వంలో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల పంపిణీలో తగిన నాణ్యత లేదనే పిర్యాదులపై శుక్రవారం పలు హోటల్స్ పై హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఫుడ్ అండ్ సేఫ్టీ కంట్రోల్ బోర్డ్ అధికారి మద్దిలేటి సిబ్బందితో కలసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ నగరంలోని హోటల్స్ లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు విక్రయించినట్లు పిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. తాము నిర్వహించిన తనికీల్లో నమ్మలేని నిజాలు వెలుగు చూశాయని తెలిపారు. ముగ్గిన మటన్, కుళ్ళిపోయిన చికెన్, పాసిపోయిన గుడ్లు వంటివి కనిపించాయని తెలిపారు. ఇలా వచ్చిన వాటిని పరీక్షలకు పంపామని తెలిపారు. ఫలితాలు వచ్చే వరకు హోటల్స్ మూసివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఇలాంటి ఆహార పదార్థాలు స్వీకరించడం వలన రోగాల పాలు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ తనికీల్లో ఫుడ్ అండ్ సేఫ్టీ కంట్రోల్ బోర్డ్ మెంబెర్స్, నగరపాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్



**రాజంపేట మన జనప్రగతి ఏప్రిల్ 24 :-** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం నాడు స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి చమర్తి జగన్ మోహన్ రాజు వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చమర్తి విమర్శించారు.అదేవిధంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తున్నామని చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు అంతకుముందు భూ సమస్యలు పెన్షన్స్ డ్రైనేజ్ పక్కా ఇళ్ళపై,తదితర అంశాలపై ప్రజల నుంచి అర్జీలను చమర్తి జగన్ మోహన్ రాజు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహాభారత యజ్ఞంలో అలరించిన భీష్ముని విజయం



**రామాపురం మన జనప్రగతి ఏప్రిల్ 24:-** అన్నమయ్య జిల్లా రామపురం మండలం రామాపురం నందు శుక్రవారం జరిగిన మహాభారత యజ్ఞ కార్యక్రమంలో. భీష్మ విజయం. మరియు. కర్ణుని జననం కథను. హరికథ భాగవతారని. శారద గొప్పగా హరికథ రూపంలో ప్రజలను ఆకట్టుకున్నారు. కర్ణుని జననం కథలు దుఃఖ రూపంలో హరిదాసు భక్తతులను. దుక్క సాగరంలో మరిపించారు. మరియు. హరిదాసు. శారద భక్తాదులకు. విజ్ఞప్తి. మహాభారత కథను భక్తిశ్రద్ధలతో వినాలి కానీ కాలక్షేపం కోసం ఉండకూడదు ఎంతో భక్తి శ్రద్ధలతో వినాలని అన్నారు మరియు. తబలిస్ట్. సోమశేఖర్. శివతాండవం అద్భుతంగా వాయించి బత్తాదులను. ఆనందంతో ముంచి ఎత్తారు ఈ కార్యక్రమానికి . వచ్చిన ప్రజలకు భక్తాదులకు. కమిటీ తరపున అన్నప్రసాద కార్యక్రమం జరిపించారు హరిదాసు. శారద హార్మోనిస్ట్. సుదర్శన్తపలిస్టు. సోమశేఖర్ వైలెన్. హేమ కుమార్ మరియు. మహాభారత ధర్మకర్త మద్దిరేవుల రమేష్ రెడ్డి. ఆగ్రో వెంకట్రాంరెడ్డి. అయోధ్య పురం. చిన్న రెడ్డి. గాలివీటి దామోదర్ నాయుడు. పియ్యాలవెంకటసుబ్బయ్య. గంపసుబ్బరాయుడు. రమణ. సూర్యనారాయణ రెడ్డి. భక్తవత్సల రెడ్డి. ప్రసాద్. అయోధ్య పురం బాబుల్ రెడ్డిగా. మహేష్. వెంకటేష్. పాల్గొన్నారు

## పీలేరులో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

**110 మంది కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు అధికారులు**




**పీలేరు, మన జనప్రగతి ఏప్రిల్ 24:-** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.పీలేరు నియోజవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం కార్యక్రమాన్ని చేపట్టాలని శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనల మేరకు,కూటమి నాయకులు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ వ్యవస్థ ప్రాముఖ్యత, గ్రామ స్వరాజ్య స్ఫూర్తి గురించి వివరించారు. స్థానిక పాలనలో పంచాయతీల పాత్ర కీలకమని, గ్రామాల అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 110 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి కూలీలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, బ్రహ్మానందరెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, ఎక్స్ జెడ్పిటిసి మల్లెల రెడ్డి భాష, మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, ప్రముఖ నేత పోలిశెట్టి సురేంద్ర, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి, కూటమి నాయకులు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు కార్మికులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -04-2026

## పెనమలూరు గ్రామంలో గ్రీన్ షాపులను ప్రారంభించిన పెనమలూరు మండల రెవెన్యూ తాసిల్దార్ రాజు






**పెనమలూరు,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** పెనమలూరు నియోజకవర్గం, పెనమలూరు మండలం పెనమలూరు గ్రామంలో, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిమిత్తము పెనమలూరు నియోజకవర్గం లోని పెనమలూరు గ్రామంలో వ్యర్ధాలను కొనుగోలు చేసి నిత్యవసర సరుకులు ఇచ్చే గ్రీన్ షాప్ ని పెనమలూరు మండల రెవెన్యూ తాసిల్దార్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుటకు అనేకమైన నూతన కార్యక్రమాల చేపడుతున్నారు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యర్ధాలు నుంచి ప్లాస్టిక్, కాళీ సీసాలు, ఇళ్లల్లో ఉపయోగించని వస్తువులను తీసుకొని దానికి అనుగుణంగా నిత్యవసర సరుకులు అందించే షాపులను ఏర్పాటు చేయటం ద్వారా ప్రజలకు ఉపయోగ తో పాటు, పర్యావరణాన్ని కూడా రక్షించవచ్చని ఉద్దేశ్యముతో ఇటువంటి నూతన కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. గ్రామాలలో యువత గ్రీన్ ఫీల్డ్ సోల్జర్స్ గా మారి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. అభివృద్ధి చెందిన దేశాలలో ఉపయోగించే ఈ పద్ధతిని రాష్ట్రంలో అవలంబిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుపూడి ధన కోటేశ్వరావు కోయ ఆనంద ప్రసాద్ తోటకూర ఉదయ భాస్కర్ చిగురుపాటి శ్రీనివాసరావు పంచాయతీ సెక్రెటరీ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించని వారికి అపరాధ రుసుము విధించిన ఎస్సై లేఖ ప్రియాంక

**చిలకలూరిపేట,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై లేఖ ప్రియాంక అన్నారు.చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల రహదారిపై వాహనాలను సిబ్బందితో కలిసి ఆమె తనిఖీలు చేపట్టారు. హెల్మెట్లు లేని 17 వాహనాల వద్ద రూ.10,185 జరీమాన విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని, వాహనానికి సంబంధించి ఆర్ సి దగ్గర ఉంచుకోవాలని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని వాహనదారులకు తెలిపారు. పోలీసుల సలహాలు తీసుకొని ప్రమాదాలను నివారించాలని వాహనదారులకు ఎస్ఐ సూచనలు ఇచ్చారు

## ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి దిశానిర్దేశం

● సిబ్బందికి సమగ్ర శిక్షణ కార్యక్రమం






**కడప, మన జనప్రగతి ఏప్రిల్ 24 :** కడప సింధూర్ ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు.శిక్షణలో భాగంగా పంటలకు హాని కలిగించే పురుగులు, తెగుళు మరియు వాటి నివారణ చర్యలపై వివరంగా చర్చించారు. మిత్ర పురుగుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రకృతి వ్యవసాయంలో వాటి పాత్రను వివరించారు. అదనంగా జీవామృ తం, ఘనజీవామృతం, వివిధ కషాయాల తయారీ విధానం, వినియోగం మరియు వాటి ప్రయోజనాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు.ఈ శిక్షణ ద్వారా సిబ్బంది నేర్చుకున్న విషయాలను గ్రామస్థాయిలో రైతులకు చేరవేయాలని సూచించారు. అలాగే క్యాడర్ సభ్యుల సొంత పొలాల స్థితిగతులను పరిశీలిస్తూ, వారి ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. భూమిని 365 రోజులు పచ్చదనంతో కప్పి ఉంచే విధానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి ఆరోగ్యం, స్థిరమైన ఆదాయం మరియు మెరుగైన దిగుబడులు సాధ్యమవు తాయని పేర్కొన్నారు. కొత్తగా ఎంపికైన కార్యకర్తలు ఈ శిక్షణను సమగ్రంగా గ్రహించి, స్వయంగా ప్రకృతి వ్యవసాయం ఆచరిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని, గ్రామాల్లో మోడల్ ఫార్మ్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బంది నైపుణ్యాలు మెరుగుపడి, జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తరణకు దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. 1కోటి ఎక్స్ గ్రెసియా ఇవ్వాలి

### శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే



**హైదరాబాద్ మన జనప్రగతి ఏప్రిల్ 24 :-** ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా ఆర్టీసీ ముషీరాబాద్ బస్ డిపో వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నదని డాక్టర్ గణేష్ గౌటే తీవ్రంగా విమర్శించారు. ఆర్టీసీ సమ్మెను పరిష్కరించాల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిందన్నారు.తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన పోరుబాట చివరకు సమ్మెకు దారితీసి, రాష్ట్రంలో పరిస్థితిని ఆందోళనకరంగా మార్చిందని పేర్కొన్నారు.ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం ఎంతో కలచివేసే విషయం. ముఖ్యంగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు.కాంగ్రెస్ సర్కారు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చకపోవడం, సమస్యలను పరిష్కరించకపోవడం వల్లే ఈ దారుణ పరిస్థితి ఎదురైందన్నారు. శంకర్ గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయన కుటుంబానికి ఒక కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనితోపాటు, ఆర్టీసీ కార్మికులు ముందుగానే ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినా కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికులు సమ్మెకు దిగినప్పుడు శివసేన పార్టీ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసిందని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా, 2017 నుంచి ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడం కూడా ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి. కార్మికుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి.ఆర్టీసీ కార్మికులకు శివసేన పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. వారి హక్కుల కోసం మేము పోరాటం కొనసాగిస్తున్నాం, కొనసాగిస్తూనే ఉంటాం. ఆర్టీసీ కార్మికుల పక్షాన శివసేన ఎల్లప్పుడూ నిలుస్తుంది. తెలంగాణ సమాజం మొత్తం కూడా ఈ పోరాటంలో కార్మికుల పక్షాన నిలుస్తోంది. అయితే, ఈ సందర్భంగా నేను ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాను.. ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దు. మీ సమస్యల పరిష్కారం కోసం శివసేన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాష్ట్ర కోర్టు మెంబర్ డాక్టర్ గణేష్ గౌటే, అధికార ప్రతినిధి మహేష్ కుమార్, బీసీ చైర్మన్ దాస్ సురేష్, సరస్వతి, గోపాల్, శంకర్ మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొని ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలపడం జరిగింది.

## గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎంపీడీవో శ్రీనివాసరావు



**యద్దనపూడి,మన జనప్రగతి ఏప్రిల్ 24 :** పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే గ్రామీణ ప్రాంతం అభివృద్ధి పథంలో నడవాలని ఆ లక్ష్యంతోనే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి శ్రీనివాసరావు అన్నారు. ఆయన శుక్రవారం నాడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని మండల పరిధిలోని గన్నవరం గ్రామంలో జరిగిన గ్రామ సభకు ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ పెద్ద నల్లపునేని రంగయ్య చౌదరి అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో గ్రామ పంచాయతీల నిధులను బట్టి గ్రామాలలో అభివృద్ధి పనులు చేసుకుంటూ వెళ్లాలని ముఖ్యంగా పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ అన్ని శాఖల కంటే ముఖ్యమైందని ఆ శాఖలోనే గ్రామాలలో పక్క ఇండ్లు రోడ్లు డ్రైనేజీ సదుపాయం, త్రాగునీరు లాంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని అందుకే పంచాయతీలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. ముఖ్యంగా పారిశుద్ధ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు చెత్తను తమ ఇళ్ల ముందుకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికుని చెత్త బండిలో వేస్తే ఆ చెప్పను వారు ఎస్ డబ్ల్యూ పి షెడ్యూల్ వేస్తారని తెలిపారు. గ్రామంలో ప్రజలు అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. గ్రామ పెద్ద చౌదరి మాట్లాడుతూ గ్రామంలో పొలాలకు సరిపడే నీరు పుష్కలంగా ఉందని నల్లకుంట, రమణయ్య కుంట, కాకేడు కుంట ల మీద లిఫ్ట్ ఇరిగేషన్ లో ఏర్పాటు చేస్తే వేలాది ఎకరాలకు నీరు ఆరుతరులకు లభిస్తుందని ఈ ప్రతిపాదనలను సారి స్థానిక శాసనసభ్యులు సాంబశివరావు గారి దృష్టికి తీసుకొని వచ్చామని, వారు స్వయంగా విచ్చేసి అనుకూల పరిస్థితులను పరిశీలించి ప్రభుత్వం నుండి ఇది సాంక్షన్ వచ్చేలా చూస్తానని చెప్పారని రంగయ్య చౌదరి ఈ సందర్భంగా జరిగిన సభలో తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి మండల డిప్యూటీ తాసిల్దారు ఎస్ బి కే విష్ణు, డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి టీవీ కృష్ణ, హౌసింగ్ ఏఈ రమణ నాయక్, పంచాయతీరాజ్ ఏఈ ఆనందరావు, గ్రామ కార్యదర్శి సూర్య ప్రభాకర్ రావు, గ్రామంలోని అన్ని శాఖల పర్యవేక్షణ అధికారి జి మేరీ కనికరన్, గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ యాసిన్, గ్రామ పెద్దలు ధూళిపాళ్ల కుమారస్వామి, సోమేపల్లి బాబు, చుండి సాంబయ్య, చెరుకూరి సురేంద్ర, కొల్లా పిచ్చయ్య, సోమేపల్లి నరసింహారావు, చెరుకూరు శ్రీహరి రావు, చెన్నుపాటి పాపారావు, సోమేపల్లి ముసలయ్య ఇంకా పలువురు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మొదటగా పారిశుద్ధ్య కార్మికుడు కాకాని ఏసును దుశ్యాలతో సత్కరించారు. అనంతరం హాజరైన అధికారులందరినీ గ్రామ పెద్ద రంగయ్య చౌదరి తో పాటు, గ్రామ ప్రముఖులు దుశ్యాలువలు తో సత్కరించి, పూలమాలలు సమర్పించారు. అధికారులు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంట్లో వృధాగా ఉన్న వస్తువులతో పదిమందికి సాయం చేద్దాం:గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

● గుడివాడలో RRR సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాము... ● రెడ్యూస్ రీయూజ్ రీసైకిల్(RRR)కాన్సెప్ట్ అర్థం చేసుకోండి....




గుడివాడ, **మన జనప్రగతి ఏప్రిల్ 24 :**మన ఇళ్లలో వృధాగా ఉండే వస్తువులతో పదిమందికి ఉపయోగపడేలా ప్రేమతో, దాతృత్వంతో అందిద్దామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. మనం చేసే చిన్న సాయంతో, పేదవారికి చేయూతనివ్వచన్నారు. గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఓల్డ్ మున్సిపల్ కార్యాలయ కాంప్లెక్స్లో అన్న క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన రెడ్యూస్ రీయూజ్ రీసైకిల్ (RRR) సెంటర్‌ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు.ప్రారంభోత్సవం అనంతరం పలువురు చిన్నారులు టెక్స్ట్ పుస్తకాలు, మరికొందరు ఇళ్లలోని పాత వస్తువులను తీసుకురాగా, ఎమ్మెల్యే రాము వాటిని స్వయంగా సెంటర్‌లో ఏర్పాటు చేసిన ర్యాకుల్లో పెట్టారు. పుస్తకాలు అందించిన చిన్నారులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ మంచి లక్ష్యంతో పురపాలక సంఘం ఏర్పాటుచేసిన RRR సెంటర్ విజయవంతంలో గుడివాడ ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు.ప్రజలు తమ ఇళ్లల్లో వాడకుండా ఉన్న వస్తువులు అంటే , మరి పనికిరానివి కాకుండా ఆట వస్తువులు, బట్టలు, పుస్తకాలు, ఆట బొమ్మలు, చెప్పులు, ఎలక్ట్రానిక్ వస్తువులు.. ఇలా ఇతరులు వాడుకోవడానికి వీలుగా ఉన్నవి ఎన్నో ఉంటాయన్నారు. వాటిని పారేయకుండా RRR సెంటర్‌కు దాతృత్వం గా ఇస్తే, మరోకరికి ఉపయోగపడతాయన్నారు.RRR కాన్సెప్ట్‌ను అందరూ అర్థం చేసుకోవాలనీ, మీ ఇంట్లో వృథాగా పడి ఉండే బదులు,ఆ వస్తువులను పదిమందికి ఉపయోగపడేలా ప్రేమతో, దాతృత్వంతో ఇవ్వాలన్నారు. మీరు ఇచ్చే ఒక పాత పుస్తకం ఒక పేద విద్యార్థి చదువుకు ఉపయోగపడుతుందనీ, ఒక జత బట్టలు నిరాశ్రయుడికి అండగా నిలుస్తాయ న్నారు.మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ మాట్లాడుతూ ఈ RRR సెంటర్ పని దినాల్లో అందుబాటులో ఉంటుందనీ, మెప్మా ఆధ్వర్యంలో వారి పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. చాలా మంచి ఆలోచనతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, గుడివాడ ప్రజలంతా సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
25 -04-2026

# ఉరవకొండలో భారీ భూ కుంభకోణం

## ●రూ. 250 కోట్ల పంచాయతీ ఆస్తుల అన్యాక్రాంతం!

**ఉరవకొండ మన జన ప్రగతి ఏప్రిల్ 24:–** గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే. అయితే, ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీలో అందుకు విరుద్ధంగా 1995 నుండి 2021 వరకు సుమారు 109 పంచాయతీ స్థలాలను కేవలం పంచాయతీ తీర్మానాల ద్వారా అడ్డగోలుగా కేటాయించారనే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వీటి విలువ దాదాపు రూ. 250 కోట్లుఉంటుందని అంచనా. **అక్రమాల తీరు – నిబంధనల విస్మరణ** ప్రభుత్వ ఉత్తర్వులు (G.O.s) మరియు పంచాయతీరాజ్ చట్టాల ప్రకారం, ప్రజా ఉపయోగ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు లేదా వాణిజ్య అవసరాలకు కేటాయించడం చట్టరీత్యా నేరం. కానీ, ఉరవకొండలో కంచే చేను మేసిన చందంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై భూ దోపిడీకి పాల్పడ్డారు: ప్రజా ప్రతినిధుల అక్రమాలు: ఒక ఉపసర్పంచ్ పంచాయతీ స్థలాన్ని తన పేరిట రిజిస్టర్ చేయించుకుని అమాయకులకు విక్రయించగా, ప్రస్తుతం ఆయనపై చీటింగ్ కేసు విచారణలో ఉంది. **అధికారుల చేతివాటం:** పంచాయతీ చట్టాన్ని కాపాడాల్సిన ఈవో (జూ) గౌస్ సాహెబ్, తన భార్య పేరిట స్థలం కేటాయించి రెండు భవనాలు నిర్మించారు. అందులో ఒకటి సొంతానికి, మరొకటి భారీ అద్దెకు





ఇస్తూ లబ్ధి పొందుతున్నారు. **రాజకీయ పార్టీలు & సంఘాలు:**విలువైన స్థలాలను వామపక్ష పార్టీలు, దివంగత నేతలు, కొత్త శ్రీనివాసులు చేనేత సొసైటీల ముసుగులో కొందరు వ్యక్తులు పొంది సొమ్ము చేసుకున్నారు. **వాణిజ్య వినియోగం:** విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో ఒక అంతస్తును బ్యాంకుకు అద్దెకు ఇచ్చి లాభపడుతున్నారు. **కీలకమైన ప్రభుత్వ ఉత్తర్వులు మరియు చట్టాలు:**ఈ అక్రమ కేటాయింపులు కింది నిబంధనలను నేరుగా ఉల్లంఘిస్తున్నాయి: 1. జీవో నెం. 119 (2017): లేఅవుట్‌లలో 10% స్థలాన్ని పార్కులు, ఆటస్థలాలకే వాడాలి. 2. జీవో నెం. 188 (2011): పంచాయతీ స్థలాలను లీజుకు ఇవ్వాలన్నా ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి తప్పనిసరి. 3. ఏపీ పంచాయతీ రాజ్ చట్టం (1994): సెక్షన్ 53, 58 ప్రకారం ప్రభుత్వ భూములు, వీధులు పంచాయతీ ఆధీనంలో ఉంటాయి, కానీ వాటిని అమ్ముకోవడానికి అధికారం లేదు. **లోకాయుక్త జోక్యం – అధికారుల ఉరుకులు** సామాజిక కార్యకర్త మరియు జిల్లా సమాచార హక్కు చట్టం కార్యదర్శి లిమీనుగ మధుబాబు ఈ వ్యవహారంపై లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో నివేదికలు కదలడం ప్రారంభించాయి. లోకాయుక్త ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన అధికారులు, దాదాపు 109 స్థలాలు ఎటువంటి లీజు ఒప్పందాలు లేదా ప్రభుత్వ అనుమతులు లేకుండా కేటాయించినట్లు గుర్తించారు. **ముగింపు:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో రవి ప్రసాద్, ఈవో ఆర్ డీ మరియు ఇతర అధికారులు ఈ వివరాలనుగ్రామ సభలో వెల్లడించారు. జిల్లా కలెక్టర్ పంచాయతీ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్ గా ఉన్నందున, యుద్ధ ప్రాతిపదికన ఈ స్థలాలను స్వాధీనం చేసుకుని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు మరియు ఫిర్యాదుదారులు డిమాండ్ చేస్తున్నారు.

# లారీ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి

## - కేసు నమోదు చేసిన యస్ ఐ హారిక



**సిద్ధవటం మన జనప్రగతి ఏప్రిల్ 24:–** కడప–చెన్నై జాతీయ రహదారిపై మాధవరం గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముమ్మడి గుంటపల్లికి చెందిన నాగేశ్వరరెడ్డి (40) దుర్మరణం చెందారు. పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకుని కుమారుడు శివసాయి రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, రాజంపేట వైపు నుండి వస్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో నాగేశ్వరరెడ్డిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆయన కుమారుడికి ఎడమ చేయి విరిగింది. మృతుని సోదరుడు లక్ష్మిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# టిడిపి మంత్రులు చౌకబారు ప్రకటనలు మానుకోవాలి


## చిల్లర రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు: వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 24:–** వైసిపి పార్టీపై, వైసీపీ జాతీయ అధ్యక్షుడిపై టిడిపికి చెందిన కూటమి మంత్రులు చేస్తున్న చౌకబారు ప్రకటనలను మానుకోవాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతలు సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలను నేర వేర్చకుండా తప్పుడు విధానాలు, అజెండాలతో ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని తెలిపారు. టీడీపీ మంత్రులు జుగుప్సాకరంగా మాట్లాడడం శోచనీయం అన్నారు. కడపకు చెందిన పెద్ద దస్తగిరి కుమారుడు చాలా క్లియర్ గా పోలీసులకు పిర్యాదు చేశాడని తెలిపారు. పెద్ద దస్తగిరి కుమారుడు ఇచ్చిన పిర్యాదు పట్టించుకోకుండా ఈనాడు నీచ కథనాలు రాస్తున్నదని మండిపడ్డారు. వైసిపికి ,వైఎస్ జగన్ కు లింక్ పెడుతూ తప్పుడు కథనాలు వండుతున్నారని చెప్పారు. వయస్సు పెరిగే కొద్ది చంద్రబాబు నీచంగా మాట్లాడుతున్నారని తెలిపారు.వైఎస్ జగన్ మీద ఈనాడు నిచమైన, నికృష్టమైన రాతలు రాయడం దుర్మార్గం అన్నారు. చంద్రబాబు మాట్లాడే సమయంలో హోదా, స్థాయి గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద నిందలు వేయడానికి చంద్రబాబుకు సిగ్గు అనిపించలేదా అని ప్రశ్నించారు. దమ్ముంటే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద నేరుగా యుద్ధం చేయగలవా అన్నారు. ఆంధ్రజ్యోతి అంటే చంద్రబాబు, ఆంధ్రజ్యోతి అంటే టిడిపి ఎద్దేవా చేశారు. పొలిటికల్ గేమ్ కోసం చంద్రబాబు దిగజారి రాజకీయాలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలెంటీ, ఎన్నికల తర్వాత చేస్తుందేంటి అని అన్నారు. చంద్రబాబు తన హామీల నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు చిల్లర రాజకీయాలు చేస్తున్నట్లు చెప్పారు. మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నేతలు దాడులు చేసుకొంటే పిన్నెల్లి సోదరుల మీద కేసులు పెట్టడం సరైనది కాదన్నారు. వైఎస్ఆర్ మరణంపై చంద్రబాబు మీద కేసు పెట్టచ్చు అన్నారు. చంద్రబాబు సవాల్ విసిరిన నాలుగు రోజులకు వైఎస్ఆర్ చనిపోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో జరిగే హత్యలకు ఎ–1 గా చంద్రబాబు పై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకు ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్తారని తెలిపారు. రాజధాని ముసుగులో చంద్రబాబు ప్రజాధనం దోచుకుంటున్నట్లు ఆరోపించారు. మావిగన్ ఉపయోగాలు జగన్ విజన్ ప్రజల్లోకి స్పష్టంగా వెళ్ళిందని తెలిపారు. దస్తగిరిని హత్య చేయాల్సిన అవసరం నిత్యానందరెడ్డి కి ఏముందని చెప్పారు. కడప ఇన్ చార్జ్ మంత్రి సవిత తెలివి ఉండే మాట్లాడుతున్నారా అన్నారు. చంద్రబాబు చేస్తున్న తప్పులను దేవుడు లెక్కిస్తున్నాడని చెప్పారు.


# అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలిచిన మంత్రి నారాయణ





**నెల్లూరు మన జనప్రగతి ఏప్రిల్ 24:–** రాష్ట్రపురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకొన్నారు .అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి అయోమయంలో పడిన బాధితులకు అండగా నిలిచి నేనున్నాననే భరోసా కల్పించారు.నెల్లూరు సిటీ 45 వ డివిజన్ నక్కలోళ్ళ సెంటర్ లో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది .బొమ్మల దుకాణం అగ్నికి ఆహుతి అయిపోయింది .వ్యాపారంకోసం తెచ్చిపెట్టిన బొమ్మలన్నీ బూడిదైపోయాయి .జీవనాధారం కోల్పోవటంతో వీధిన పడ్డ బాధితులు దిక్కుతోచని అయోమయంలో పడిపోయారు .తన కార్యాలయం ద్వారా సమాచారం తెలుసుకొన్న మంత్రి నారాయణ వెంటనే స్పందించారు .టీడీపీ నేతలను సంఘటనా స్థలానికి పంపి బొమ్మలదుకాణం నడుపుతున్న బాధితులకు భరోసా కల్పించారు .తక్షణ సాయం కింద తన సొంత నిధి నుంచి 20 వేల రూపాయలను ప్రకటించారు .మంత్రి నారాయణ సింగపూర్ అధికారిక పర్యటనలో ఉండటంతో మంత్రి తరపున నగదును టీడీపీ నేతలు బాధితులకు అందించారు .ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతర పరిహారాలకోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సుజన్, శ్రీనివాసులు రెడ్డి, నాగేంద్ర రోజ్ మేరీ,వీరు తదితరులు పాల్గొన్నారు .

# 27 నుంచి వైఎంసీఏలో సమ్మర్ క్యాంప్



**నారాయణగూడ మన జనప్రగతి ఏప్రిల్ 24:–** వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్, నారాయణగూడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి మే 30వ తేదీ వరకు 45వ వార్షిక 'వైఎంసీఏ సమ్మర్ క్యాంప్ –2026' ను నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి ప్రిస్ట్ లీ గైస్ తెలిపారు. బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, లాన్ టెన్నిస్, టెబుల్ టెన్నిస్, షటిల్ బ్యాట్మిం టన్, చెస్, వెస్ట్రన్ డాన్స్, యమగుచ్చి కరాటే, కిక్ బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, స్కేటింగ్ తదతర క్రీడా, సాంస్కృతిక పోటీల్లో శిక్షణ తరగతులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వివరాలకు సెల్: 7032660614లో సంప్రదించాలని ఆయన కోరారు.

# వైసీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా వల్లెపు వరప్రసాద్ నియామకం

## సేవలను గుర్తించి కీలక బాధ్యతలు అప్పగించిన జగన్ మోహన్ రెడ్డి

## హర్షం వ్యక్తం చేస్తున్న వైసీపీ శ్రేణులు

## అధిష్టానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటా పార్టీ బలోపేతమే లక్ష్యం

## పులివెందుల మున్సిపల్ మాజీ చైర్మన్ వి.వరప్రసాద్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 24:–** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక పదవుల భర్తీలో భాగంగా పులివెందులకు చెందిన ప్రముఖ నాయకుడు వల్లెపు వరప్రసాద్ కు కీలక బాధ్యతలు దక్కాయి.వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వరప్రసాద్‌ను పార్టీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.వైఎస్సార్ జిల్లా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వరప్రసాద్ పార్టీ స్థాపన నుండి జగన్ మోహన్ రెడ్డి వెన్నంటి ఉంటూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం రాష్ట్రస్థాయిలో ఈ పదవిని అప్పగించింది.వల్లెపు వరప్రసాద్‌కు రాష్ట్ర స్థాయి పదవి దక్కడం పట్ల పులివెందుల నియోజకవర్గ వైసీపీ నాయకులు,కార్యకర్తలు మరియు బీసీ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జగన్ మోహన్ రెడ్డికి,సహకరించిన జిల్లా నేతలకు వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.బీసీల సంక్షేమం పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# తమ వైద్యంలో లోపం లేదు... ఉపాధ్యాయుడి మృతిపై వైద్యుల వివరణ



**కాకినాడ మన జనప్రగతి ఏప్రిల్ 24:–** వైద్య లోపంతో ఉపాధ్యాయుడు మరణించాడనేది నిజం కాదని ఆయనకు పూర్తి నిబంధనలతో కూడిన వైద్యాన్ని అందించామని అయినా చనిపోవడం అత్యంత బాధాకరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) కాకినాడ జిల్లా శాఖ జిల్లా వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సైన్స్ మాస్టర్ మైలపల్లి శ్రీనివాస వినీల్ మృతిపై వైద్యులు కాకినాడలోని హాలులో మీడియా సమావేశం నిర్వహించి వివరణ ఇచ్చారు. శుక్రవారం ఐఎంఏ కాకినాడ అధ్యక్షుడు కాదా వెంకటరమణ, అప్నా అధ్యక్షుడు సునీల్, కార్డియాలజిస్ట్ అధ్యక్షుడు మాతా శ్రీనివాస్, అప్నా జిల్లా కార్యదర్శి చిట్ల కిరణ్, కార్డియాలజిస్ట్ కార్యదర్శి పివి నిషాంత్, ఐఎంఎ కార్యదర్శి రామకృష్ణ వివరించారు. కాకినాడ సర్పవరం జంక్షన్లో మిత్ర హార్ట్ కేర్లో ఉపాధ్యాయుడు వినీల్ 21వ తేదీ రాత్రి ఛాతీ నొప్పితో చేరారన్నారు. అన్ని పరీక్షలు నిర్వహించి రెండు స్టెంట్లను వేడి వైద్యమును ప్రారంభించామని చెప్పారు. సుమారు 45 నిమిషాల తర్వాత మరలా వైద్యం అందించామన్నారు. అయినా ఆయన మృతి చెందడం అత్యంత బాధాకరమని చెప్పారు. వైద్యంలో లోపం లేదని, అందరిని కాపాడాలనేదే మా తపన అని అన్నారు. ఈ తరహా గుండవ్యాధులు వచ్చిన వారిలో గతంలో 14 శాతం మంది చనిపోయేవారని ఇప్పుడు దానిని నాలుగు శాతంకు తగ్గించినట్లు చెప్పారు. గుండెకు స్టెంట్ వేసినా రక్తం గడ్డకట్టే విధానం ఉండడం వల్ల చనిపోతున్నట్లు పేర్కొన్నారు. స్టెంట్ వేసినా రక్తం గడ్డకట్టే చికిత్స విధానం పైన ఇంకా వైద్యులు పరిశోధన చేస్తున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమానులు, నర్సింగ్ హోమ్ అసోసియేషన్ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి: మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 24:–** పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యక శ్రద్ధ పెట్టితే విద్యార్థి చదువులో రాణించేందుకు వీలు ఉంటుందని మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విజయభారతి పాఠశాలలో కరస్పాండెంట్ మేడా ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా తరగతుల్లో విద్యలో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ ను మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరి ప్రసాద్ లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమ శిక్షణ అనేది రావాలని చెప్పారు. ప్రస్తుత సమాజంలో రాణించాలంటే చదువు తప్పని సరిగా ఉండాలని అది లేకపోతే వ్యర్థం అన్నారు. గతంలో పాఠశాలలో ఉపాధ్యాయుల భయం విద్యార్థులకు ఉండేదని కాని ప్రస్తుతం ఉపాధ్యాయుల భయం విద్యార్థులకు లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుపడాలంటే ఉపాధ్యాయుల భయం అనేది తప్పకుండా ఉండాలని కోరారు. తల్లిదండ్రులు కూడ వాటికి మద్దతు తెలపాలని కోరారు. కుటుంబ స్థితిగతులను విద్యార్థులకు తెలియ జేయాలని కోరారు. చదువు అనేది పరుగు పందెం లాంటిదని చెప్పారు. భవిష్యత్తు బాగు పడేందుకు విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి కోరారు. విద్యార్థి జీవితం చాలా విలువైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేడా ప్రదీప్ కుమార్, గండి అన్న దాన సత్రం ప్రెసిడెంట్ పచ్చిపులుసు కిషోర్, ఆవోఫా అధ్యక్షుడు బిజిఎస్. వెంకట సునీల్, కొండారెడ్డి తో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174